సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 30 । జనవరి । 2024



సోమశిలలో 26.270 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 26.270 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టా, ఉత్తర, దక్షిణ, కావలి కాలువలకు 3,050 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.64,720
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,812
3 శాతం జీఎస్టీతో..	రూ.5,986
నవర (8 గ్రా)	రూ.47,888

గరిష్టం/కనిష్టం
31.0 /23.0

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 54 శాతం ఉంది. ఉష్ణోగ్రత సాధారణంగానే ఉంది. మంగళవారం ఎలాంటి మార్పులు ఉండబోవని వాతావరణ శాఖ తెలిపింది

న్యూస్‌రీల్

బాధ్యతలు చేపట్టిన జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



జేసీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న రీసర్వే స్వామిత్వ గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించడానికి చర్యలు తీసుకుంటామని నూతన జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారంతో ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ కేరళ రాష్ట్రంలోని క్యాలికట్‌కు చెందిన వారు. 2020 ఐఏఎస్ బ్యాచ్. కలెక్టర్ హరినారాయణన్‌ను జాయింట్ కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌లోని పలువురు అధికారులు, సిబ్బంది జేసీని కలిసి అభినందనలు తెలిపారు.

ఎంపీపీ మృతి



వి.భవానమ్మ (ఫైల్)

విడవలూరు: విడవలూరు ఎంపీపీ వేణుంబాక భవానమ్మ (78) అనారోగ్య కారణాలతో సోమవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేస్తూ ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు భవానమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

నేత్రదానం

ఎంపీపీ భవానమ్మ చివరి కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను విడవలూరుకు చెందిన మనసేవ సంస్థ చైర్మన్ దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో దానం చేశారు. నెల్లూరు మాడరన్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ వేణు ఆమె నేత్రాలను సేకరించారు.

నిందితుడికి మూడేళ్ల జైలు

కోవూరు: హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు ఖాదర్‌బాషాకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పి.చైతన్య సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని దర్గా సమీపంలో పఠాన్ చాన్‌బాషా టింకరింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో 2022 అక్టోబర్ 14వ తేదీన అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న షేక్ ఖాదర్‌బాషా, కల్యాణ్, సుధాకర్ ముగ్గురూ పఠాన్ చాన్‌బాషా షాపునకు వెళ్లి ఆటోకు టింకరింగ్ చేయించుకున్నారు. పఠాన్ చాన్‌బాషా టింకరింగ్‌కు రూ.600 ఖాదర్‌బాషా ను అడగగా, వారు ముగ్గురూ అతనితో వాగ్వాదానికి దిగారు. అనంతరం పఠాన్ చాన్‌బాషా గుండెపై ఖాదర్‌బాషా తీవ్రంగా గాయపరచడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి కుమారుడు ఖాజారసూల్ కోవూరు పోలీస్‌స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అప్పటి సీఐ రామకృష్ణారెడ్డి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిందితులు ఖాదర్‌బాషా, కల్యాణ్, సుధాకర్‌లను కోర్టులో హాజరుపరిచారు. కల్యాణ్, సుధాకర్‌లపై నేరం రుజువు కాలేదు. ఖాదర్‌బాషాపై నేరం రుజువు కావడంతో అతనికి మూడేళ్ల జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున కె.రామకృష్ణ వాదించారు.

జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘ కార్యవర్గ ఎన్నిక



పీవీ నారాయణరెడ్డి

నెల్లూరు (లీగల్): జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శిగా పీవీ నారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ శాఖ ఉద్యోగుల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నారాయణరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎంపీ శివకుమార్, ఉపాధ్యక్షులుగా వి.వెంకటేశ్వర్లు, సీహెచ్ పోలయ్య, ఎస్‌కే షఫీ, సీహెచ్, వెంకటేశ్వర్లు జాయింట్ సెక్రటరీలుగా బీ సురేందర్‌బాబు, బీ దినేష్‌కుమార్, ఎస్ శివయ్య, ఏ మల్లికార్జున, కోశాధికారిగా సునీల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా ప్రెసిడెంట్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అభ్యర్థుల ఎన్నికకు పోటీ నెలకొనడంతో మార్చి 3న ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు.

పేదలకు పక్కా ఆస్తి

జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గూడు లేని పేదలకు ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు ఇల్లు నిర్మించి ఇస్తోంది. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాకుండా ఆ స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయితే లబ్ధిదారులకు ఆ స్థలాలపై పూర్తి హక్కులు సంక్రమించనున్నాయి.

- సచివాలయాల్లో ప్రారంభమవుతున్న ప్రక్రియ
- వచ్చే నెల 9వ తేదీకి పూర్తి చేసేలా ఏర్పాట్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



విజయమూరులోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

ఉదయగిరి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలను నిర్మిస్తూ సొంతింటి కల సాకారం చేస్తున్నారు. అంతేకాకుండా మరో అడుగు ముందుకేసి ఇళ్ల స్థలాలు ఇచ్చిన అక్కచెల్లెమ్మలకు ఆ స్థలంపై హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు చేస్తూ కన్వేయన్స్ డీడ్‌ను అందజేస్తున్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అసైన్ చట్టాన్ని సవరిస్తూ ఓ జీఓ జారీ చేసింది. ఈ మేరకు పదేళ్ల తర్వాత అవి సేల్‌డీడ్‌గా మారుతాయి. దీంతో లబ్ధిదారులకు వీటిపై సర్వహక్కులు సంక్రమిస్తాయి. ఈ ప్రక్రియ గ్రామ సచివాలయాల్లో ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే నెల 9వ తేదీ నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

శరవేగంగా ఏర్పాట్లు

జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ 10 రోజులపాటు కొనసాగనుంది. ఈ మేరకు శనివారం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై అధికారాలిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఈ ప్రక్రియ నిర్వహించేందుకు జిల్లాలో 544 సచివాలయాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ డీడ్‌లో తప్పులు దొర్లకుండా నిర్ణీత గడువు లోపు ప్రక్రియ పూర్తి చేసేందుకు లబ్ధిదారుల ప్లాట్ నంబర్లు, హద్దుల వివరాలు రెవెన్యూ సిబ్బంది సిద్ధం చేశారు. ఈ మేరకు శనివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు.



జలదంకి మండలం జమ్మలపాలెంలో నిర్మాణం పూర్తయి గృహ ప్రవేశం చేసిన ఇల్లు

ప్రయోజనాలు ఇవే

- స్థలం రిజిస్ట్రేషన్ ద్వారా ఇంటిపై లబ్ధిదారులకు హక్కులు సంక్రమిస్తాయి.
- అత్యవసర నిమిత్తం ఇంటిని బ్యాంకులో తనఖా పెట్టి లోన్ తీసుకోవచ్చు.
- ఇంటి విలువ పెరిగి మార్కెట్‌లో కొనుగోలుకు డిమాండ్ పెరుగుతుంది.
- అత్యవసర సందర్భాల్లో ఇంటిని విక్రయించుకోవచ్చు.
- వారసులకు గిఫ్ట్ డీడ్ కింద ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు.

గతంలో అలా..

ప్రభుత్వాలు గతంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలకు డి.ఫాం పట్టాలు ఇచ్చేవి. ఈ పట్టాను తనఖా పెట్టుకొని గృహ నిర్మాణశాఖ ఇంటికి రుణం ఇచ్చేది. లబ్ధిదారులకు ఎలాంటి హక్కులు ఉండేవి కావు. రూపాయి అప్పు ఇచ్చేవారు కాదు. రిజిస్ట్రేషన్‌కు వీలు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో తక్కువ ధరకే తెగనమ్ముకునే పరిస్థితి ఉండేది.

జగనన్న ప్రభుత్వంలో ఇలా..

ప్రస్తుతం ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే కన్వేయన్స్ డీడ్ పదేళ్ల తర్వాత ఆటోమేటిక్‌గా సేల్‌డీడ్‌గా మారుతుంది. ఏ అధికారి వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. లబ్ధిదారులకు పూర్తి హక్కులు సంక్రమిస్తాయి. ఈ వెసులుబాటు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో 86,122 మందికి ఇళ్లు మంజూరు

రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం ద్వారా జిల్లాలోని జగనన్న కాలనీల్లో 86,122 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కొక్క గృహం నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించింది. లబ్ధిదారులైన పొదుపు మహిళలకు అదనంగా మరో రూ.35 వేల డ్వాక్రా రుణాన్ని సైతం అందజేసింది. రాయితీపై ఇనుము, సిమెంటుతో పాటు ఉచితంగా ఇసుక అందజేస్తోంది. అలాగే జగనన్న కాలనీల్లో రూ.కోట్లు ఖర్చు చేసి తాగునీరు, విద్యుత్ సౌకర్యం, సీసీ రోడ్లు, డ్రైయిన్లు తదితర మౌలిక వసతులు కల్పిస్తోంది. తద్వారా జగనన్న కాలనీల్లో ఒక్కొక్క ఇంటి విలువ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు చేస్తుందని అంచనా. జిల్లాలో ఇప్పటికే అనేక జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని లబ్ధిదారులు గృహ ప్రవేశం చేశారు. కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి లబ్ధిదారుడికి పక్కాగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పూర్తి చేసి పత్రాలు అందజేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు.

చాలా సంతోషంగా ఉంది



మాది చాలా పేద కుటుంబం. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. సొంతిల్లు లేదు. అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. గతంలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసినా ఇవ్వలేదు. జగనన్న సీఎంగా వచ్చిన తర్వాత ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. ఇంటి స్థలంతో పాటు గృహం కూడా మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని సొంతింట్లో ఆనందంగా చేరాం. పైగా జగనన్న ఈ స్థలానికి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారని చెప్పడం ఎంతో సంతోషంగా ఉంది. ఇలాంటి సీఎం పదికాలాల పాటు ఉంటే మాలాంటి పేదలకు న్యాయం జరుగుతుంది. – పి.మమత, జమ్మలపాళెం, జలదంకి మండలం

లబ్ధిదారులకు పూర్తి హక్కులు



ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. స్థలం రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారులకు పూర్తి హక్కులు వస్తాయి. ఇది పేదలకు ఎంతో ప్రయోజనం. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈ నెల 29 నుంచి ప్రారంభమైంది. ఈ ప్రక్రియను వచ్చే నెల 9వ తేదీ వరకు కొనసాగిస్తాం. – ఎం.హరినారాయణన్, కలెక్టర్

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- 'వైఎస్సార్ ఆసరా' సంబరాల్లో సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం



లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(బారకాసు): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ ఆసరా' పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గత ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చిన హామీ మేరకు వరుసగా నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ నేపథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి మెప్మా ఆధ్వర్యంలో పొదుపు మహిళలతో 'వైఎస్సార్ ఆసరా సంబరాలు' సోమవారం నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో పండగ వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంపీ ఆదాల ముఖ్యఅతిథిగా హాజరై నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పొదుపు మహిళలకు సంబంధించిన రూ.17.07 కోట్ల వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పక్కాగా అమలు చేస్తున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషప్రచారం చేసేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఎల్లోమీడియా ఏకమయ్యారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ఆ పథకాలకు సంబంధించిన ప్రయోజనాలను లబ్ధిదారులైన మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నారని తెలిపారు. గత 10 నెలల్లోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో దాదాపు రూ.150 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తాను ఎంపీగా నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం రూ.100 కోట్లు నిధులు తీసుకువచ్చానని తెలిపారు. అంతేకాకుండా నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని జాతీయ రహదారి, మినీబైపాస్‌రోడ్డులో మూడు బ్రిడ్జిల నిర్మాణాలు జరగనున్నాయని తెలిపారు. మహిళలందరూ ముఖ్యమంత్రికి అండగా నిలవాలని, నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. నెల్లూరు నగర మేయర్ స్రవంతి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని, ఇచ్చిన మాట ప్రకారం పొదుపు మహిళలకు 'వైఎస్సార్ ఆసరా' పథకం ద్వారా రుణమాఫీ చేశారని తెలిపారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం

'వైఎస్సార్ ఆసరా' సంబరాలకు వేలాదిగా విచ్చేసిన పొదుపు మహిళలు ఎంపీ ఆదాల సమక్షంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభి షేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ తదితర పథకాల ద్వారా అందిస్తున్న సాయంతో తామంతా ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నామంటూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకుంటామంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రవీంద్ర, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైవీ రామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కార్పొరేటర్లు పిండి శాంతిశ్రీ, దాసరి అమృతరాజేష్, యాకసిరి వాసంతి, బొబ్బల శ్రీనివాసయాదవ్, ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, మూలే విజయభాస్కర్‌రెడ్డి, తాళ్లూరు అవినాష్, డాక్టర్ షేక్ సత్తార్, కోఆప్షన్ సభ్యురాలు సయ్యద్‌మొబీనా, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు చింతల జ్యోతి, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు హరితరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పొదుపు మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఎంపీ ఆదాల

గడువులోపు అర్జీలు పరిష్కరించండి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో అందే అర్జీలు గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో భూములకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, సర్వే అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించాలని తెలిపారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ధర్నా నిర్వహించి అనంతరం స్పందనలో వినతిపత్రం సమర్పించారు. అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. విద్యుత్ తీగలు తగిలి జిల్లాలో మృతిచెందిన ఇద్దరు రైతు కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలని కోరుతూ బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్వో ఎస్.లవన్న, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మిత, డీఈఓ గంగాభవాని, గృహనిర్మాణశాఖ పీడీ నాగరాజు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ కృష్ణమోహన్, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు వెంకట్రావు, హేనాసుజన్, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీసీఎస్ రమేష్‌నాథ్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ విజేతగా నెల్లూరు



- జంగారెడ్డిగూడెంలో ముగిసిన అండర్–19 రాష్ట్రస్థాయి పోటీలు

జంగారెడ్డిగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో రెండు రోజులపాటు నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో బాలుర విభాగంలో విజయనగరం, బాలికల విభాగంలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. స్కూల్ గేమ్స్ సెక్రటరీ డి.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో అండర్–19 విభాగంలో ఉమ్మడి జిల్లాల నుంచి 8 జట్లు పాల్గొన్నాయి. తుది పోటీల్లో బాలుర విభాగంలో విజయనగరం జిల్లా విజేతగా, పశ్చిమగోదావరి జిల్లా ద్వితీయ స్థానం, శ్రీకాకుళం జిల్లా తృతీయస్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా విజేతగా, పశ్చిమగోదావరి జిల్లా ద్వితీయ స్థానం, విశాఖపట్నం జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయి. సోమవారం విజేత జట్లను అభినందించి పతకాలు అందజేశారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- ప్రభుత్వ భూమిలో వారసత్వంగా పలువురి పేర్లు నమోదు
- అధికారులు, టీడీపీ నేతల కుమ్మక్కు
- రూ.3 కోట్ల విలువ చేసే భూమికి ఎసరు
- రూ.లక్షల్లో చేతులు మారిన వైనం

ఉదయగిరి : దుత్తలూరు రెవెన్యూ పరిధిలో బ్రహ్మేశ్వరం వద్ద రూ.3 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాజేసేందుకు రెవెన్యూ అధికారులు, టీడీపీకి చెందిన ఓ నేత పక్కా ప్లాన్ వేశారు. ఆ మేరకు రెవెన్యూ రికార్డుల్లో పట్టా భూమిగా కనబరుస్తూ వారసత్వంగా ఇద్దరు పేర్లపై 32.51 ఎకరాలు వన్‌బీ, అడంగల్‌లో నమోదు చేశారు. ఈ భూమి విలువ మార్కెట్‌లో రూ.3 కోట్ల పైమాటే అని తెలుస్తోంది. ఈ వ్యవహారం వెనుక భారీగా ముడుపులు చేతులు మారినట్లు సమాచారం.



తప్పుడు రికార్డులతో సొంతం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్న భూమి

తెర వెనుక కథ ఏంటంటే..

దుత్తలూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 448–1లో 141.16 ఎకరాల భూమి పాత రికార్డుల్లో గర్భ కంద్రికగా నమోదైంది. ఈ భూమిని అమ్మడం, కొనడం నిషేధం. ఒక రకంగా చెప్పాలంటే ప్రభుత్వ భూమిగా పరిగణించాలి. కానీ దుత్తలూరుకు చెందిన ఓ టీడీపీ నేత అందులో 32.51 ఎకరాల భూమిపై కన్నేశాడు. ఎలాగైనా కాజేసేందుకు 2021లో అప్పటి తహసీల్దార్ ఏవీ రమణారావుతో బేరం కుదుర్చుకున్నాడు. గుట్టుచప్పుడు కాకుండా వారసత్వంగా షేక్ జమీరుద్దీన్ పేరుపై 12.51 ఎకరాలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి షేక్ మహమ్మద్ హుసేన్ పేరుపై మరో 20 ఎకరాలు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారు. వాటి ఆధారంగా 2022 జనవరిలో పట్టదారు ఈ–పాస్‌పుస్తకాలు పొందారు. వీటి ఆధారంగా ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2022లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో షేక్ మహమ్మద్ హుసేన్ వెంటనే తాను చేసిన రిజిస్ట్రేషన్ రద్దు చేసుకొని తన పేరు రెవెన్యూ రికార్డుల్లో తొలగించాలని అప్పటి తహసీల్దార్‌కు రాతపూర్వకంగా లేఖ ఇచ్చాడు. వెంటనే తహసీల్దార్ డిజిటల్ సైన్ నిలిపివేసి రెడ్‌మార్క్‌లో పెట్టారు. కానీ ప్రస్తుత తహసీల్దార్ సైన్ ఇవ్వడంతో ప్రొద్దుటూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో షేక్ మహమ్మద్ హుసేన్‌కు సంబంధం లేకుండానే అదే పేరు ఉన్న మరోవ్యక్తి ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. దీని వెనుక కూడా ఆ టీడీపీ నేత కీలకంగా ఉన్నట్లు సమాచారం. ఈ 32.51 ఎకరాల భూమిలో కొంతభాగం ఖలీల్ అనే వ్యక్తి ఆక్రమించి సాగు చేసే ప్రయత్నం చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదు.

జేసీకి ఫిర్యాదు చేసినా చలనం లేదు

ఈ భూకుంభకోణంపై జేసీ కూర్మనాథ్‌కు ఫిర్యాదు చేసినా విచారణ జరపలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారడంతో అధికారులు కూడా కిమ్మనడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కలెక్టర్ స్వయంగా విచారణ జరిపి ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పేర్ల నమోదు వాస్తవమే

భూకుంభకోణంపై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. వీఆర్వో సర్వేశ్వరరావును వివరణ కోరగా, ఈభూమికి సంబంధం లేని షేక్ మహమ్మద్ హుసేన్, జమీరుద్దీన్ పేర్లు వారసత్వంగా నమోదు చేసిన మాట వాస్తవమే, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందని తెలిపారు. – సర్వేశ్వరరావు, వీఆర్వో

జగన్ ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యం

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు


ఆసరా చెక్కుల పంపిణీలో పాల్గొన్న ఎంపీ మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నాయకులు

దగదర్తి(కావలి): 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇంటి స్థలాలు వారి పేరుతోనే ఇచ్చారు. వివిధ పథకాలు ప్రవేశపెట్టారు' అని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలిపారు. 'ఆసరా' నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం దగదర్తిలో మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా మస్తాన్‌రావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో రాష్ట్రం మహిళా సాధికారతలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయని తెలిపారు. రుణభారంతో ఉనికి కోల్పోతున్న సంఘాలను జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నట్లు చెప్పారు.

నియోజకవర్గానికి లబ్ధి

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గానికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు రూ.2,500 కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. నిరంతరం ప్రజల కోసం పోరాటం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకునేందుకు, పెత్తందార్లకు దోచిపెట్టేందుకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలే జగనన్న సైన్యంలా మారి బాబు కుట్రలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మహిళలకు నమూనా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్ నాయుడు, జెడ్పీటీసీ తాళ్లూరి స్వరూపారాణి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా' హామీ సంపూర్ణంగా నెరవేరింది

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


పొదుపు మహిళలకు నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు: 'వైఎస్సార్ ఆసరా హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణంగా నెరవేర్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళలకు నాలుగు విడతల్లో నగదు ఇచ్చి అండగా నిలిచారు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. తోటపల్లిగూడూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ ఆసరా సంబరాలు జరిగాయి. మంత్రి పాల్గొని మాట్లాడుతూ ఈ పథకం కింద సర్వేపల్లి నియోజకవర్గంలో నాలుగు విడతల్లో 4,063 గ్రూపులకు రూ.122.37 కోట్లు ఇచ్చారన్నారు. సర్వేపల్లి సీటు తనకు దక్కకపోయినా పర్వాలేదని, ఎట్టి పరిస్థితుల్లోనూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాకూడదని పాకులాడుతున్న టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని చూస్తే జాలేస్తుందన్నారు. బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, కొత్తగా కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన షర్మిల చంద్రబాబు గెలుపు కోసం పనిచేస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. ఎందరు ఏకమైనా జగనన్న విజయాన్ని అడ్డుకోలేరన్నారు. అనంతరం వివిధ పొదుపు సంఘాలకు రూ.3.20 కోట్ల బ్యాంకు రుణాలు, రూ.4.55 కోట్ల స్త్రీ నిధి రుణ చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, తోటపల్లిగూడూరు, పేడూరు సొసైటీల చైర్మన్లు కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను మర్చిపోవద్దు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు చేసిన మోసాన్ని పొదుపు మహిళలు మర్చిపోవద్దని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం ఆవరణలో సోమవారం ఆసరా పథకం చెక్కుల పంపిణీ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాయా అని సభలో ఆయన ప్రశ్నించగా.. మహిళలు రాలేదన్నారు. పసుపు – కుంకుమ పథకాన్ని ఎన్నికల ముందు హడావుడిగా ప్రకటించి ఎంత మందిని మోసం చేశారో గుర్తు చేసుకోవాలని ఎమ్మెల్యే వారితో అన్నారు. గత టీడీపీ పాలన, ఇప్పటి వైఎస్సార్‌సీపీ పాలనను బేరీజు వేసుకుని రానున్న ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ఆయన కోరారు. దీంతో మహిళలు మళ్లీ జగనన్నే సీఎం అంటూ నినదించారు. ఆత్మకూరు రూరల్ మండల పరిధిలో ఆసరా కింద రూ.2.29 కోట్ల నగదు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా, ఆర్డీఓ కె.మధులత, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీప్రసన్న, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, వెలుగు ఏసీ వెంకటేశ్వరరావు, ఏపీఎం బి.వెంకమ్మ, సొసైటీల అధ్యక్షులు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, సానా వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వేదాయపాళెం): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలో 2024 – 25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గురుకులాల కో–ఆర్డినేటర్ టి.హేమలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 260
లేయర్ చికెన్	: 145

తెలుగుదేశం కుట్రలను తిప్పి కొట్టండి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పిలుపు


నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

ఇందుకూరుపేట: వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు చంద్రబాబు నాయుడు కుట్రలకు పాల్పడుతున్నాడని, వాటిని మహిళలు తిప్పికొట్టి తమ శక్తిని తెలియజేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తూరులో మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆసరా పథకంలో భాగంగా ఇప్పటి వరకు నియోజకవర్గంలో 4,546 పొదుపు సంఘాల్లోని 44,869 మందికి రూ.147.29 కోట్ల మేర ప్రభుత్వం ఆర్థికంగా భరోసా కల్పించిందన్నారు. ఇందుకూరుపేట మండలంలో 865 పొదుపు గ్రూపులకు నాలుగో విడతలో రూ.7.58 కోట్లు ఇచ్చారన్నారు. మొత్తంగా ఇప్పటి వరకు 8,538 మందికి రూ.30.37 కోట్ల మేర లబ్ధి జరిగిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్‌లు ఏకమై జగన్‌ను ఓడించాలని చూస్తున్నాయన్నారు. పేదలు జగన్ వైపు, పెత్తందారులు బాబు, పవన్ వైపు ఉన్నారన్నారు. మిమ్మల్నే నమ్ముకున్న సీఎంను ఆశీర్వదించాలని మహిళలను కోరారు. అనంతరం నమూనా చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎంఎస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, తహసీల్దార్ సుబ్బయ్య, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 80 ఫిర్యాదులు


సమస్యలు తెలుసుకుంటున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని ఉమేషచంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 80 మంది విచ్చేసి తమ సమస్యలపై ఏఎస్పీ (క్రైమ్స్) ప్రసాద్, డీఎస్పీలు పి.వీరాంజనేయరెడ్డి, శ్రీనివాసులు, ... వినతులు అందజేశారు. వాటిని పరిశీలించిన వారు సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను మభ్యపెట్టి వారి వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరింపులకు గురిచేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువతులు, బాలికలపై వేధింపులు, దాడులకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే తగిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సీనియర్ సిటిజన్స్ సమస్యలపై సత్వరమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఫిర్యాదుదారులకు ఉచిత ంగా భోజనం అందజేశారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.44
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20

వంద మంది ఉపాధ్యాయులకు శిక్షణ


మాట్లాడుతున్న ఉషారాణి

నెల్లూరు(టౌన్): జిల్లా స్థాయిలో వివిధ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న 100 మంది ఉపాధ్యాయులకు రెండురోజులపాటు కెరీర్ గైడెన్స్‌పై వృత్యంతర శిక్షణ ప్రారంభించినట్లు కోర్సు డైరెక్టర్, డీఈఓ ఆర్‌ఎస్ గంగా భవాని తెలిపారు. సోమవారం నెల్లూరు నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న నారాయణ సీబీఎస్ఈ పాఠశాలలో ప్రారంభమైన శిక్షణలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువు పూర్తయ్యాక ఏ వృత్తిని ఎంచుకోవాలనే విషయంలో అనేక సందేహాలను కలిగి ఉంటారన్నారు. ఆ సమయంలో ఉపాధ్యాయులు వారికి సరైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. తద్వారా వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన వారవుతారన్నారు. అందులో భాగంగా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇన్ సర్వీస్ టీచర్లకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమగ్ర శిక్ష, నెల్లూరు ఏఎంఓ జి.సుధీర్‌బాబు మాట్లాడుతూ శిక్షణ అనంతరం ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల సహకారంతో కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించి పిల్లలు వారి అభిరుచులకు అనుగుణంగా వృత్తులను ఎంచుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ సీహెచ్ ఉషారాణి, డాక్టర్ కె.శారద, అనూష కామిరెడ్డి, ఎస్‌వీ మంజునాథ్, ప్రభుత్వ డైట్ ఉపన్యాసకుడు కె.వి జయచంద్ర పాల్గొన్నారు.

ఇరిగేషన్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో నీటిపారుదల శాఖకు సంబంధించిన స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్రమణదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు దళారులుగా మారి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై పోలీసు కేసులు నమోదు చేస్తామన్నారు.

జీజీహెచ్‌లో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌పై దాడి

- స్టాఫ్ నర్సు భర్త నిర్వాకం


ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

నెల్లూరు సిటీ: నెల్లూరు జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ స్టాఫ్ నర్సు భర్త బైక్ పార్కింగ్ విషయంలో సెక్యూరిటీ సూపర్‌వైజర్ సయ్యద్‌పై దాడి చేసిన ఘటన సోమవారం జరిగింది. ఆయా వర్గాల కథనం మేరకు.. నర్సును హాస్పిటల్‌కు ఆమె భర్త బైక్‌పై తీసుకొచ్చాడు. ఈ క్రమంలో బైక్‌ను హాస్పిటల్‌కు అడ్డుగా పార్కింగ్ చేశాడు. వాహనాన్ని పక్కన పార్కింగ్ చేసుకోవాని, అంబులెన్స్‌లు వస్తాయని సయ్యద్ అతడికి చెప్పాడు. అయితే నర్సు భర్త అతడితో గొడవకు దిగాడు. దీంతో మాటామాటా పెరిగి కోపోద్రిక్తుడైన అతను సయ్యద్‌పై దాడి చేశారు. కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దాడి ఘటనపై సెక్యూరిటీ సిబ్బంది హాస్పిటల్ వద్ద ఆందోళన చేశారు. ఆస్పత్రి అధికారులు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది.